సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



9 మందికి కారుణ్య నియామకాలు
తొమ్మిది మందికి కారుణ్య నియామక ఉత్తర్వులన్ను కలెక్టర్ సుమిత్‌కుమార్ తన కార్యాలయంలో అందజేశారు. IIలో



మెరుగైన సేవలందించాలి
గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాధన ఆదేశించారు. IIలో



బైక్‌ల చోరీ ముఠా అరెస్టు
ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసి, 20 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. IIలో

న్యూస్‌రీల్

పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా హేమలత

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ధర్మారావు



మహారాణిపేట (విశాఖ): కాకినాడ రంగరాయ వైద్యకళాశాల గైనిక్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి.హేమలతను పదోన్నతిపై పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం ఆర్థోపెడిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ వి.ధర్మారావు పదోన్నతిపై పాడేరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మావోయిస్టుల వారోత్సవాలపై ప్రత్యేక నిఘా

- చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి రూరల్: ఈనెల 27 వరకు జరగనున్న మావోయిస్టు పార్టీ వార్షిక వారోత్సవాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత పరంగా ప్రత్యేక చర్యలు తీసుకుటున్నామన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా.. కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ గ్రేహౌండ్స్, పోలీస్ బలగాలతో కూంబింగ్ ఏర్పాటు చేశామన్నారు. గతంతో పోల్చుకుంటే మావోయిస్టుల వల్ల కలిగే నష్టంపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు.

నేడు పాడేరులో జాతీయ సైన్స్ సెమినార్

- జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు

పెదబయలు: జిల్లా కేంద్రమైన పాడేరు తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురువారం జాతీయ సైన్స్ సెమినార్-2023 నిర్వహిస్తున్నట్టు జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు తెలిపారు. ఎన్‌సీఎస్ఎం, వీఐటీఎం బెంగళూరు వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సెమినార్‌కు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 8,9, టెన్త్ విద్యార్థులు పాల్గొంటున్నట్టు చెప్పారు. చిరుధాన్యాలు మంచి పౌష్టికాహారమా? లేక ఆహార వ్యామోహమా అనే అంశంపై సెమినార్ జరుగుతుందన్నారు. పాల్గొనే విద్యార్థులు గైడ్ టీచర్‌తో తలార్‌సింగి పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

తెరిపివ్వని వాన

- రెండు రోజులుగా భారీ వర్షాలు
- గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి



పాడేరులో కురుస్తున్న వర్షం



గోమంగి వంతెనపై నుంచి వరద ప్రవాహం

సాక్షి,పాడేరు : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పాడేరు, రంపచోడవరం డివిజన్‌లో పలుచోట్ల భారీవర్షాలు వర్షాలు కురుస్తుండడంతో ప్రధాన గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి నెలకొంది.

నిలిచిన రాకపోకలు

ముంచంగిపుట్టు, పెదబయలు, డుంబ్రిగుడ మండలాల్లో అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో మారుమూల ప్రాంతాల్లో గెడ్డలు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రవాణాపరంగా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

పెరుగుతున్న నీటిమట్టాలు

విలీన మండలాల్లో కూడా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో భద్రాచలం వద్ద గోదావరి, చింతూరు, కూనవరం, వీఆర్‌పురంలో విస్తరించిన శబరి నదులకు వరద నీరు అధికమైంది. జిల్లాలో చింతూరు డివిజన్ మినహా, మిగిలిన మండలాల్లో బుధవారం 259.3 ఎంఎం వర్షపాతం నమోదైంది.

మత్స్యగెడ్డకు వరద తాకిడి

జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డలో వరద ప్రవాహం అధికమైంది. మత్స్యగుండంలో వరద నీరు పొంగి ప్రవహిస్తుంది. అలాగే పెదబయలు, ముంచంగిపుట్టు,జి.మాడుగుల మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో గెడ్డల్లో కూడా నీటి ప్రవాహం ప్రమాదకరంగానే ఉంది.

అధికార యంత్రాంగం అప్రమత్తం

గిరిజనులు గెడ్డలు దాటి సాహస ప్రయాణాలు చేయవద్దంటు ఆయా ప్రాంతాల్లోని రెవెన్యూ యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. శుక్రవారం ఉదయం నుంచే వర్షం కురిసింది.. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని మండలాల రెవెన్యూ యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అప్రమత్తం చేశారు.

వర్షపాతమిలా..

జిల్లాలో అత్యధికంగా ముంచంగిపుట్టులో 48.2 ఎంఎం, అత్యల్పంగా కూనవరంలో 0.1 ఎం వర్షపాతం నమోదైంది. పెదబయలులో 36.2, పాడేరు 34.5, అరకులోయ 25.3, డుంబ్రిగుడ 23.4, హుకుంపేట 21.8. జి.మాడుగుల 19.8. జి.కే.వీధి 13.5, అనంతగిరిలో 13.8, చింతపల్లి 9.3 వై.రామవరంలో 6.6, కొయ్యూరులో 0.7, మారేడుమిల్లిలో 0.1 ఎంఎం వర్షపాతం నమోదైంది.

పెదబయలు: మండలంలో బుధవారం తెల్లవారు జాము నుంచి కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. గెడ్డలు,వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.,మండలంలోని గోమంగి- మద్రిపుట్టు గ్రామాల మధ్య వంతెనపై నుంచి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బొంగరం వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు గోమంగి నుంచి వెనుదిరిగింది. లింగేటి, గోమంగి, ఇంజరి,గుల్లేలు పంచాయతీల ప్రజలు గెడ్డ ఉధృతి తగ్గిన తరువాత రాకపోకలు సాగించారు. వరి పొలాలు నీటమునిగాయి. గుల్లేలు వంతెనపై నుంచి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. గిన్నెలకోట, జామిగుడ గెడ్డల్లో వరద ఉధృతి నెలకొంది.

కొట్టుకుపోయిన మద్దిగరువు కాజ్‌వే

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కిల్లంకోట మార్గంలో కోడిమామిడి గెడ్డ, కుంబిడిసింగి రోడ్డు మార్గంలో మత్స్యగెడ్డ పొంగి ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బొయితిలి-మద్దిగరువు రోడ్డు మార్గంలో కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు స్తంభించాయి.

డుంబ్రిగుడ: రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. సంపంగిగెడ్డ పొంగి ప్రవహించడంతో కించుమండ వారపు సంతకు వచ్చే వారు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ శివశ్రీనివాస్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: ఈనెల 22న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ అభ్యర్థులంతా సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ కోరారు. జాబ్‌మేళాకు సంబంధించి ప్రచార పోస్టర్లను బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 18నుంచి 30 ఏళ్ల వయసు లోపు ఉన్న ఇంటర్, డిప్లమో,డిగ్రీ, బీటెక్ తదితర ఉన్నత చదువులు అర్హత ఉన్న నిరుద్యోగ యువతీ,యువకులు ఈ జాబ్‌మేళాకు అర్హులన్నారు.ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.30వేల వరకు వేతనాలు చెల్లిస్తారని ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. అసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు బయోడేటా, ఆధార్, విద్యార్హత తదితర ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9491786463, 6304634447 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్, జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి అప్పలరామం తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు జెడ్పీటీసీపై దాడి



భూవివాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు

- రోలుగుంట మండలంలో భూవివాదం
- కర్రలతో దాడి చేసిన స్థానికులు
- తీవ్ర గాయాలు.. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స

IIలో

ప్రతినెలా రంపచోడవరంలో గ్రీవెన్స్

- 12 పోలీసుస్టేషన్లకు కొత్త భవనాలు
- ఎస్పీ తుహిన్ సిన్హా



సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికుడి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

రంపచోడవరం: ప్రతి నెలా రంపచోడవరం ఏఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. స్థానిక ఏఎస్పీ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి మాట్లాడారు. జిల్లాలో కొత్తగా 12 పోలీసుస్టేషన్లకు కొత్త భవనాలు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు తగ్గాయన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ప్రేరణ పేరుతో రంపచోడవరం, పాడేరు కేంద్రాలుగా యువతకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, రోడ్డు నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు విడుదలైతే పనులు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. కొత్త జిల్లాలో పోలీసుస్టేషన్ల సంఖ్య పెంచాల్సిన అవసరం లేదన్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారన్నారు. పరివర్తన పేరుతో పోలీస్ శాఖ చేపట్టిన అవగాహన సదస్సులు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. లోతట్టు ప్రాంతాల్లో గిరిజనులు పూర్తిగా వ్యవసాయంపై దృష్టి సారించారన్నారు. జిల్లా మీదుగా గంజాయి రవాణాకు అడ్డుకట్టవేసినట్టు తెలిపారు. సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికుడి సమస్యను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

158 వినతుల స్వీకరణ

- జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన
- కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టు/పెదబయలు: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 158 వినతులను కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ స్వీకరించారు. తాగునీటి సమస్య, రహదారుల నిర్మాణం, భూ సమస్యలు, డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్లు, మట్టి రోడ్లు నిర్మాణాలకు సంబంధించి అర్జీలు అందినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వీఎస్ ప్రభాకర్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ. రమేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డీఎల్పీవో పీఎస్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు, ఈఈ వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, ఎంపీడీఓ ఎస్. రమేష్, తహసీల్దార్ నర్సమ్మ పాల్గొన్నారు.

- దోడిపుట్టు పంచాయతీ కుమ్మిడిపుట్టు జంక్షన్ నుంచి బీడిచెంప వరకు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలని బీడిచెంప గ్రామస్తులు పాంగి దశరథి, పాంగి రాజు వినతిపత్రం అందజేశారు.
- ముంచంగిపుట్టులోని విద్యుత్‌శాఖ కార్యాలయం వెనుక నుంచి కించాయిపుట్టు వరకు మట్టి రోడ్డు నిర్మించాలని ఎ.బుద్ధ, కె.రామకృష్ణ తదితరులు కోరారు.
- పాత ముంచంగిపుట్టు గ్రామానికి చెందిన దూరు కాంతమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఏనుగురాయి పంచాయతీ అలడమూల గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని, మురుగుచెరువు గ్రామానికి మంజూరైన తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సర్పంచ్ సిరగం నరసింగరావు వినతి పత్రాలు అందజేశారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం

- రంపచోడవరంలో గుర్తించిన అధికారులు
- పూర్తిస్థాయి విచారణకు డీపీవో ఆదేశం



రంపచోడవరం పంచాయతీ కార్యాలయం

రంపచోడవరం: స్థానిక మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎస్. సత్యనారాయణమూర్తి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు అధికారులు గుర్తించారు. గతంలో రికార్డులు తనిఖీ చేసిన డీఎల్పీవో రాఘవన్ నిధులు పక్కదారి పట్టినట్టు గుర్తించారు. ఈవిషయాన్ని డీపీ వో కొండలరావు దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీకి సంబంధించి ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, పారిశుధ్య నిధులకు సంబంధించి సుమారు రూ.60 లక్షలకు పైగా పక్కదారి పట్టి ఉండవచ్చని తెలుస్తోంది. మృతి చెందిన పారిశుధ్య కార్మికుడి వేతనాన్ని కూడా ఏడాది పాటు డ్రా చేసి స్వాహా చేసినట్టు తెలిసింది. దీనిపై డీఎల్పీవో రాఘవన్ మాట్లాడుతూ రికార్డుల తనిఖీలో గత కార్యదర్శి నిధులు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఐదేళ్ల కాలానికి చెందిన రికార్డులు తనిఖీ చేయాల్సి ఉందన్నారు. ఎంత మొత్తంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డరనే విషయాన్ని రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి వెల్లడిస్తామన్నారు.

చంద్రబాబు అరెస్టు సక్రమమే!



చర్చా వేదికలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చలం



హాజరైన ప్రతినిధులు

- చట్ట ప్రకారమే సీఐడీ నడుచుకుంది
- అవినీతికి పాల్పడిన మాజీ సీఎంలు గతంలో అరెస్టయ్యారు
- చట్టం ఎవరికీ చుట్టం కాదు..
- రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్ చర్చావేదికలో వక్తలు

సాక్షి, విశాఖపట్నం: 'చట్టం ఎవరికీ చుట్టం కాదు.. అవినీతికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షకు అర్హులే. గతంలో అవినీతి ఆరోపణలతో కేసులు నమోదైన పలువురు మాజీ ముఖ్యమంత్రులు అరెస్టై జైలు కెళ్లారు. ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అరెస్టు కూడా సక్రమమే. చట్ట ప్రకారమే సీఐడీ నడుచుకుంది' అంటూ పలువురు న్యాయ నిపుణులు పేర్కొన్నారు. వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్ పేరిట బుధవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో చర్చా వేదిక జరిగింది. దీనికి పలువురు న్యాయ నిపుణులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ చర్చా వేదికలో ఎవరేమన్నారంటే..?

దొరికితేనే దొంగ..



చంద్రబాబు ఇన్నాళ్లూ తాను నిప్పు అని చెప్పుకున్నారు. తననెవరూ ఏమీ చేయాలేరని బీరాలు పలికారు. స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయారు. దీంతో దొరికితేనే దొంగ అన్న చందంగా మారింది ఆయన తీరు. స్కిల్ స్కాంపై 2021లోనే సీఐడీ క్షుణ్ణంగా దర్యాప్తు చేసింది. రూల్ ఆఫ్ లా పనిచేస్తే కక్ష సాధింపు అంటున్నారు. ప్రభుత్వ సొమ్ము దోపిడీ చేసిన వారిని శిక్షించకూడదా? చంద్రబాబు అవినీతికి ఏళ్ల తరబడి జైల్లో ఉండాల్సి వస్తుంది.

– పోశా సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది

వైఎస్సార్‌కు రాష్ట్రం రుణపడి ఉండాలి



రాష్ట్రానికి లా యూనివర్సిటీ ఆవశ్యకతను గుర్తించి సబ్బవరంలో నల్సార్‌కు దీటైన దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయాన్ని (డీఎస్ఎన్‌ఎల్‌యూ) దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి, పట్టుదలతో ఏర్పాటు చేశారు. అందుకే ఆయన చరిత్రలో నిలిచిపోతారు. రాష్ట్రంలో అత్యున్నత విద్యా ప్రమాణాలున్న ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు రాష్ట్రానికే గర్వకారణం. వైఎస్సార్‌కు ఆంధ్ర రాష్ట్రం రుణపడి ఉండాలి. భారత్‌లో రూల్ ఆఫ్ లా ఎంతో పటిష్టంగాను, ఇతర దేశాలకు ఆదర్శంగానూ ఉంది.

– వై.సత్యనారాయణ, ప్రథమ వైస్ ఛాన్సలర్, డీఎస్ఎల్‌యూ

ఒకే రూల్ ఆఫ్ లా అమలు కావాలి



ప్రజా ప్రతినిధులు చేసే అవినీతిని నిరూపించడం చాలా కష్టం. ఎందుకంటే కొంతమంది తమ సహాయకుల ద్వారా అక్రమార్జనకు పాల్పడతారు. వారికి మౌఖిక ఆదేశాలివ్వడం ద్వారా దర్యాప్తు సంస్థలకు దొరక్కుండా తప్పించుకుంటారు. అందుకే ప్రధాని స్థాయి నుంచి సామాన్యుడి వరకు ఒకే రూల్ ఆఫ్ లా అమలు కావాలి. మన దేశంలో ఈ పరిస్థితి రావడానికి కొంత సమయం పట్టొచ్చు. మాజీ సీఎం చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సమగ్ర దర్యాప్తు అనంతరం పక్కా ఆధారాలతోనే సీఐడీ అరెస్టు చేసింది. ఆయన అరెస్టు అక్రమం అనడం సరికాదు. అవినీతి చేస్తే ఎవరిపైనైనా చర్యలుంటాయన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలి.

– ఎ.సుబ్రహ్మణ్యం, ప్రథమ రిజిస్ట్రార్, డీఎస్ఎల్‌యూ

స్కిల్ స్కీం.. స్కాం అయింది



చంద్రబాబు హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం కాస్తా స్కాంగా మారింది. చట్టం ఎవరికీ చుట్టం కాదు. ఆయనపై సీఐడీ నమోదు చేసిన సెక్షన్లతో పదేళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఆధారాల్లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారంటూ ఆయన కోడలు బ్రాహ్మణి ఆరోపణలు చేస్తున్నారు. అభియోగాలున్న వ్యక్తిని అరెస్టు చేయవచ్చన్న విషయం తెలుసుకోవాలి. ఇప్పటికే ఈ స్కాంలో బాధ్యులైన చంద్రబాబు పీఏ శ్రీనివాస్, మరో వ్యక్తి విదేశాలకు పారిపోయారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం సరికాదు.

– బంగారి, అధ్యక్షుడు, జై ఉత్తరాంధ్ర ఫోరం

బాబులాగే ఎందరో..



అవినీతి ఆరోపణలతో దేశంలో పలువురు మాజీ ముఖ్యమంత్రులు అరెస్టై జైలుకెళ్లారు. వీరిలో బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, హర్యానా రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్ యాదవ్, మధుకోడా, మాయావతి, కరుణానిధి, యడ్యూరప్ప, ఓంప్రకాష్ చౌతాలా వంటి వారున్నారు. ఇప్పుడు చంద్రబాబు కూడా అలాంటి అవినీతి కేసులోనే అరెస్టై జైలులో ఉన్నారు. ఇదేమీ కొత్త కాదు. వీరంతా రూల్ ఆఫ్ లా ప్రకారమే అరెస్టయ్యారు.

– సుబ్బారావు, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్

క్లుప్తంగా

తొమ్మిది మందికి కారుణ్య నియామకాలు

- పత్రాలు అందజేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రభుత్వ సర్వీసులో ఉండగా, వివిధ కారణాలతో మృతిచెందిన ఉద్యోగులకు సంబంధించి వారి వారసులు తొమ్మిది మందికి కారుణ్య నియామక ఉత్తర్వులను కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం అందజేశారు. ఎస్.దిలీప్‌కుమార్, డి.వెంకటసాయి కార్తీక్, జి.మనోజ్‌కుమార్, ఎల్.చక్రధర్‌లను జూనియర్ అసిస్టెంట్లు, సీహెచ్ వెంకట కృష్ణప్రసాద్, సీహెచ్ అర్చనప్రియ, ఎస్.కృపావతి, బి.రవికుమార్‌లను టైపిస్టుగా, డి.మహేశ్వరిని ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు. అంకితభావంతో పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని వారిని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అంబేద్కర్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

- జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి సాధన

చింతపల్లి రూరల్: గిరినులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాధన ఆదేశించారు. మండలంలో లోతుగెడ్డ పీహెచ్‌సీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఉన్న ఐఎల్‌ఆర్, డీప్‌ఫ్రీజర్, వ్యాధి నిరోధక టీకాలు వాటి శీతలీకరణ, నాణ్యతను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాలు అరికట్టేందుకు సకాలంలో గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేయాలని ఆదేశించారు. సుఖ ప్రసవాల వివరాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ జానకి పాల్గొన్నారు.

పాడేరు ఐటీడీఏ స్పందన రద్దు

- రేపు పెదబయలులో జగనన్న చెబుదాం
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: ఈనెల 22వతేదీ శుక్రవారం పెదబయలు మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పాడేరు ఐటీడీఏలో శుక్రవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. జిల్లా వాసులు ఈ విషయాన్ని గుర్తించి పాడేరు ఐటీడీఏకు రావొద్దని కలెక్టర్ సూచించారు. పెదబయలు మండల కేంద్రంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరవుతారన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. స్పందన అనంతరం అన్నిశాఖల జిల్లా అధికారులు గ్రామసచివాలయాలను సందర్శించి ఆయా శాఖల సచివాలయాల క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు.

కొయ్యూరు జెడ్పీటీసీపై దాడి



గాయపడిన జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు



గాయపడిన జెడ్పీటీసీ నూకరాజును పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

రోలుగుంట: ఎం.కె.పట్నం శివారు చటర్జీపురంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఆయన కుమారుడు కన్నబాబు, మనుమడు చిన నూకరాజుపై స్థానికులు దాడి చేశారు. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని నర్సీపట్నం ఆస్పత్రిలో చేర్పి, చికిత్స అందిస్తున్నారు. రోలుగుంట ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. జిల్లా సరిహద్దులోని కొయ్యూరు మండలం జెడ్పీటీసీ వారా నూకరాజు.. చటర్జీపురంలో ఉన్న భూములు తమవని పేర్కొంటూ వాటిని స్వాధీనం చేసుకునేందుకు అనుచర వర్గంతో వచ్చారు. పదిహేనేళ్లుగా అక్కడ నివసిస్తూ పంటలు పండించుకుంటున్నామని స్థానిక గిరిజనులు అభ్యంతరం చెప్పారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి, ఘర్షణ ముదిరింది. స్థానికులు ఒక్కసారిగా జెడ్పీటీసీ వర్గంపై కర్రలతో దాడికి దిగారు. ఈ దాడిలో జెడ్పీటీసీ తలకు తీవ్ర గాయమైంది. ఆయనతోపాటు కుమారుడు, మనుమడు కూడా గాయపడ్డారు. ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్, రోలుగుంట ఎస్‌ఐ బి.నాగకార్తీక్ సంఘటనా స్థలానికి వెళ్లి విషయం తెలుసుకున్నారు. అక్కడ ఘర్షణ వాతావరణాన్ని సద్దుమణిగించారు. ఆస్పత్రికి వెళ్లిన ఎస్‌ఐ బాధితుల స్టేట్‌మెంట్ తీసుకుని కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి, వారిని పరామర్శించారు. చటర్జీపురానికి చెందిన రెండవ వర్గం వారు కూడా స్వల్పంగా గాయపడ్డారు. భూ వివాదంపై వారు రోలుగుంట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు బుధవారం సాయంత్రం వెళ్లారు. ఆ సమయానికి అక్కడే ఉన్న నర్సీపట్నం ఆర్డీవో జయరాంని కలిసి, కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు తమపై దాడి చేసి, గాయపరచాడని, తమ పండ్ల తోటలను ధ్వంసం చేయించాడని కేదారి రాజబాబు, నీలాపు ఎరకన్న, ఈదెల రాజేశ్వరి, నీలాపు అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు.

ఎస్‌ఐ మీడియాతో మాట్లాడుతూ జెడ్పీటీసీ నూకరాజు ఈ ప్రాంతంలో భూమి కొనుగోలు చేసిన వివరాలు తమకు చెప్పారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు. స్థానిక గిరిజనుల ఫిర్యాదుపై ఆర్డీవో మాట్లాడుతూ దీనిపై పూర్తి స్థాయి నివేదికను అందించాల్సిందిగా తహసీల్దార్ వరహాలను ఆదేశించినట్లు తెలిపారు. వాస్తవాలు పరిశీలించాక నివేదికను, ఉన్నతాధికారులకు అందించి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

పథకం ప్రకారం దాడి

కొయ్యూరు: జెడ్పీటీసీ వారా నూకరాజుపై పథకం ప్రకారం దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాను కోరినట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారా నూకరాజును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూకరాజు సొంత పొలంలో పనులు చేస్తుండగా చటర్జీపురానికి చెందిన వారు వచ్చి కళ్లలో కారం కొట్టి పథకం ప్రకారం దాడికి పాల్పడ్డారన్నారు. ఇందుకు కారకులపై చర్యలు తీసుకోవాలని ఫోన్లో ఏఎస్పీని కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నూకరాజుకు అండగా ఉంటామని ఆమె పేర్కొన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, సుమర్ల సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాన్ని పూర్తిచేయండి

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఉపాధి పనుల్లో 20 లక్షల పనిదినాల లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.20 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటివరకు కోటి పనిదినాలు పూర్తయ్యాయన్నారు. మిగతా 20 లక్షల పనిదినాలను కూలీలకు కల్పించాలని ఆదేశించారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములకు సంబంధించి రైతులకు 150 రోజులు, మిగిలిన కూలీలకు 100 రోజుల ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లంతా గ్రామాలను సందర్శించి ఆధార్‌సీడింగ్‌కు నోచుకోని జాబ్‌కార్డుదారులను గుర్తించాలన్నారు. ఆ వివరాలను ఏపీవోకు అందజేయాలన్నారు. బ్యాంకు అధికారులకు ఆ వివరాలు అందించి ఆధార్ సీడింగ్ చేయాలన్నారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద కాంట్రాక్టర్లకు ముందుగా అడ్వాన్సులు చెల్లించవద్దని సూచించారు. స్వచ్ఛమిత్రల వేతనాలు చెల్లించేందుకు ఎంపీడీవోలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోల సమన్వయంతో పనిచేసి పాఠశాలలకు దూరంగా ఉన్న విద్యార్థుల వివరాలను అందజేయాలన్నారు. మండల సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సచివాలయాల సిబ్బంది హాజరు నివేదికలతో పాటు సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని అధికారుల వివరాలను తమకు అందజేయాలని ఎంపీడీవోలకు సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల జారీని వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం డీబీటీ మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



నిందితులతో పోలీసులు

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరంలో సుమారు రూ.6 వేల విలువచేసే రెండు కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం వై.రామవరం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన తెలంగాణాకు చెందిన పాలబిందుల సిద్ధు, గాదె గణేష్ గంజాయితో పట్టుబడినట్టు చెప్పారు. బైక్, గంజాయి స్వాధీనం చేసుకుని వారిద్దరిని అరెస్టు చేసి, బుధవారం కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. రిమాండ్‌కు రాజమహేంద్రవరం జైలుకు తరలించినట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో వీఆర్‌వో ఆర్.ధనలక్ష్మి,అడిషినల్ ఎస్‌ఐ కె.రాంబాబు, ఏఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఎంజెపిబిసిడబ్ల్యుఆర్ స్కూల్, సింహాచలంలో జరిగిన అండర్-14, అండర్ 17 బాలుర, బాలికల హ్యాండ్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 బాలికల విభాగంలో ముగ్గురు, బాలుర విభాగంలో ఒకరు, అండర్ 17 బాలుర విభాగంలో ముగ్గురు, బాలికల విభాగంలో నలుగురు ఎంపికయ్యారని, వీరు ఈ నెల 29 వ తేదీ నుంచి గుంటూరు జిల్లా తెనాలిలో ఎ.ఎస్.ఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనున్నారని ప్రధానోపాధ్యాయుడు డి.వి. శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, కోచ్‌లు సురేష్, బాలరాజు తదితరులు అభినందించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన యువతి కనిపించడం లేదని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. తిమ్మరాజుపేటకు చెందిన రావాడ సీతారామ్‌కు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె స్వాతి ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసింది. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేందుకు అనకాపల్లిలో ప్రయివేటు షాపులో పనిచేసి కొంతకాలం క్రితం మానివేసింది. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం తాను అనకాపల్లి వందపడకల ఆసుపత్రికి వెళ్లి మాత్రలు తీసుకుంటానని చెప్పి స్వాతి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం అవుతున్నా ఆమె ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆమె కోసం ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి సీతారామ్ మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ అలీ తెలిపారు.

బైక్‌ల చోరీ ముఠా అరెస్టు

20 వాహనాలు స్వాధీనం



అరెస్టు చేసిన నిందితులతో అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి: ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసి, 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు... కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంకు చెందిన మొల్లేటి రామాంజనేయులు బైక్ గత నెల 25న చోరీకి గురైంది. ఈ నెల 14న అందిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ రాజారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం దొడ్డవరం వద్ద వాహనాలు తనిఖీ చేశారు.

ఆ సమయంలో చింతపల్లి మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన వంతల సోమరాజు, మాకవరపాలెం తామరం గ్రామానికి చెందిన ఆకేటి దుర్గా ప్రసాద్ నంబర్ ప్లేట్ లేని బైక్ మీద వస్తూ పోలీసులను చూసి పరారవుతుండగా వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్దనుంచి పూర్తి సమాచారం రాబట్టారు. గతంలో విశాఖపట్నం, మాకవరపాలెం,రాజమహేంద్రవరం ప్రాంతాల్లో వీరి బైక్‌లు దొంగిలించారు. వీరి వద్ద నుంచి పోలీసులు 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోమరాజు, దుర్గా ప్రసాద్‌లు చోరీ చేసిన ద్విచక్రవాహనాలను చింతపల్లి మండలం నిమ్మపాడుకు చెందిన గెమ్మిల సన్యాసిరావు(సంతోష్)కు విక్రయిస్తున్నారు. ఈ బైకులను సంతోష్ గంజాయి రవాణాకు వినియోగించడంతో పాటు, కొన్ని బైకులను ఒడిశా రాష్ట్రానికి తరలించి విక్రయిస్తున్నట్టు అదనపు ఎస్పీ తెలిపారు. వీరితో సంబంధం ఉన్న చింతపల్లి మండలం అన్నవరానికి చెందిన పాంగి ప్రకాష్, పోతురాజుగుమ్మలకు చెందిన వంతల నాగేంద్రలను కూడా అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు. గెమ్మిల సన్యాసిరావు(సంతోష్) గతంలో వేరే కేసులో అరెస్టు చేసినట్టు ఏఎస్పీ తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి సీఐ రమేష్, ఎస్‌ఐ అరుణ్ కిరణ్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇరువురికి గాయాలు



ఘటనా స్థలంలో ఛిద్రమైన బైకులు

రావికమతం: చీమలపాడు గ్రామం వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇరువురు గిరిజనులకు తీవ్ర గాయాలైనట్లు కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. కొత్తకోట నుంచి పెదెంపాలెం వెళ్తున్న సెగ్గే కృష్ణ, సన్నిబాబు బైక్‌ను ఎదురుగా పల్సర్ బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణ, సన్నిబాబులకు తీవ్రగాయాలయ్యాయి. కృష్ణ భార్య తలుపులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పరారైన పల్సర్ బైకిస్టు ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర వైద్య బృందం



కేంద్ర వైద్య బృందం ప్రతినిధులతో ఏరియా ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది

నర్సీపట్నం : జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఢిల్లీ నుంచి ఇద్దరు వైద్య బృందం సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిని బుధవారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం తరపున డా.వై.రమణ, డా.శ్రీనివాస్ జాతీయ ఆరోగ్య పథకం ద్వారా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. బృందం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆయా విభాగాల ద్వారా అందిస్తున్న సేవలు గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి బృంద సభ్యులకు వివరించారు. రికార్డులను తనిఖీ చేసి వైద్యులు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏరియా ఆసుపత్రిలో పాటు తాళ్లపాలెం, మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బృంద సభ్యులు తనిఖీ చేశారు. బృంద సభ్యులు వెంట ప్రోగ్రాం అధికారులు డా.తులసి, మురళి, ప్రశాంతి, డీపీవో జగదీష్, స్టాటస్టికల్ అధికారి రామచంద్రరావు పాల్గొన్నారు.

రూ.12.50 కోట్లతో 125 ఆలయాల నిర్మాణం

- దేవదాయ ధర్మాదాయ శాఖ డీఈ దూదేకుల సైదా



నాతవరంలో శ్రీనల్లకొండమ్మ తల్లి వద్ద డీఈ సైదా, వైఎస్సార్‌సీపీ నాయకులు

నాతవరం: ఉమ్మడి జిల్లాలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు రూ.12.50 కోట్లతో 125 దేవాలయాల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని దేవదాయ, ధర్మాదాయ శాఖ డీఈ దూదేకుల సైదా తెలిపారు. బుధవారం ఆయన నాతవరం, గన్నవరం, మర్రిపాలెం గ్రామాల్లో నిర్మిస్తున్న ఆలయాల పనులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో హిందూ ఆలయం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఒక్కో ఆలయానికి విగ్రహంతో కలిపి రూ.10 లక్షలు చెల్లిస్తున్నామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటి వరకు 15కు పైగా ఆలయాల నిర్మాణాలు పూర్తి చేసి, స్థానిక ఎమ్మెల్యేలచే ప్రారంభోత్సవాలు చేయించినట్లు తెలిపారు. మరో 80కి పైగా ఆలయాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. నవంబర్ నెలాఖరుకు శత శాతం ఆలయ నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు, దాతలు, భక్తులు ఇచ్చే విరాళాలతో ఆలయాలను పెద్దగా నిర్మించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై విచారణ

- డీటీ దొన్ను, ఆర్‌ఐ సూర్యనారాయణ, వీఆర్వో కోటకు షోకాజ్ నోటీసులు
- తహసీల్దార్ వేణుగోపాల్



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

అరకులోయ రూరల్: గిరిజనేతరుడికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై గిరిజన ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో తహసీల్దార్ వేణుగోపాల్ బుధవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత నెలలో మండల కేంద్రానికి చెందిన గిరిజనేతరుడు పిట్టల రాంబాబు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం పొందడంపై గిరిజన సంఘాల నాయకుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. అయితే విచారణలో రాంబాబు ఎస్టీ కులానికి చెందిన అర్హత గల ఆధారాలు సమర్పించలేదన్నారు. విషయాన్ని అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ దొన్ను, ఆర్‌ఐ సూర్యనారాయణ, వీఆర్వో కోటకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులైన వారిని విధుల నుంచి తొలగించడంతో పాటు గిరిజనేతరుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపారు. గిరిజనేతరుడు పిట్టల రాంబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రామారావు, హరి, మగ్గన్న, జగన్నాథం, మోహన్, భగత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

- రామన్నపాలెం సమీపంలో ఘటన
- సంఘటన ప్రాంతాన్ని పరిశీలించిన ఏఎస్పీ
- నిందితుల కోసం గాలింపు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ, ఇతర పోలీసులు



హత్యకు గురైన రవి , రవి (ఫైల్)

మాకవరపాలెం: యువకుడి దారుణ హత్య మండలంలో కలకలం రేపింది. రామన్నపాలెం గ్రామ సమీపంలో ఈ హత్య జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. మండలంలోని దుంగలవానిపాలెం గ్రామానికి చెందిన ధనిమిరెడ్డి రవి(35) ఒరిస్సా ప్రాంతంలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం ఇంటి నుంచి పనికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సుభద్రయ్యపాలెం వెళ్లే రోడ్డులో రామన్నపాలెం సమీపంలో హత్యకు గురై విగతజీవిగా ప్రత్యక్షమయ్యాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ రామకృష్ణారావు, రూరల్ సీఐ రమణయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన పోలీసుల దర్యాప్తులో రవిగా నిర్ధారించారు. వర్షం కురుస్తున్నప్పటికీ పోలీసులు సంఘటన ప్రాంతంలో ఉన్న అన్ని ఆధారాలను సేకరించారు. క్లూస్ టీంతోపాటు డాగ్ స్క్వాడ్‌తో సహా దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని, సంఘటన జరిగిన ప్రాంతాన్ని నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా సందర్శించి వివరాలు సేకరించారు. అక్కడే ఉన్న బండరాయితో తల, ముఖంపై కొట్టి హత్య చేసినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు అక్రమ సంబంధమా ? లేక ఇతర ఏదైనా కారణం ఉందా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ రమణయ్య మాట్లాడుతూ హత్య చేసిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. మృతుడికి రెండేళ్ల క్రితం కాకినాడక చెందిన యువతితో వివాహం జరగ్గా, 8 నెలల పాప ఉంది. విషయం తెలుసుకున్న రవి కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.